

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




## తిరుమలలో రాజకీయ ప్రసంగాలపై నిషేధం

- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు 8

## తుపానుపై అప్రమత్తంగా ఉండాలి



- ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు 5






చంద్రన్నా.. నీవే మా తోడన్నా! ఇది పేదల గుండె చప్పుడు 4

# సంపద సృష్టిస్తాం.. ప్రజలకు పంచుతాం

### నేమకల్లు ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన

- పేదలకు అండగా కూటమి ప్రభుత్వం
- రేషన్ మాఫియాపై ఉక్కుపాదం
- ల్యాండ్, శాండ్, గంజాయి మాఫియాలనుండి రాష్ట్రానికి విముక్తి
- సాంకేతికత అనుసంధానంతో సెల్ ఫోన్‌ల ద్వారా పౌర సేవలు
- హార్టీకల్చర్ హబ్‌గా రాయలసీమ

- వివరాలు 2,3లో..

## పసుపు సైనికుడు మిర్జా మొహమ్మద్ అలీ మృతి బాధాకరం

- సీఎం చంద్రబాబు సంతాపం
- కుటుంబానికి అండగా ఉంటామని హామీ 5

## రాయదుర్గంపై సీఎం చంద్రబాబు వరాల జల్లు

- నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కుళాయి నీరు
- ఎడారీకరణ అడ్డుకుంటాం
- పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు 3

## రైతులకు అందుబాటులో ఉండాలి

- అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం
- పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలి
- మత్స్యకారులు తుపాను ప్రభావం తగ్గే వరకు వేటకు వెళ్లరాదు 8





## పెన్షన్ల పెంపు ఘనత చంద్రబాబుదే

- హామీని అమలు చేసి మాట నిలబెట్టుకున్నారు
- దేశంలోనే అత్యధిక మొత్తం ఇస్తోంది మన రాష్ట్రంలోనే
- మంత్రి కొల్లు రవీంద్ర 5

# తీరం దాటిన 'ఫెంగల్'

- తీర ప్రాంతాలకు రెడ్ అలర్ట్
- పలు జిల్లాల్లో భారీ వర్షాలు
- నేడూ వర్ష సూచన 5
- విద్యుత్‌శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష



## వృద్ధులను జగన్‌రెడ్డి వంచిస్తే.. చంద్రబాబు అక్కున చేర్చుకున్నారు

- ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీతో పండుగ వాతావరణం
- మంత్రి అనగాని 5

## అవినీతి సామ్రాట్ బిరుదుతో జగన్‌ను సత్కరించాలా?

- మంత్రి గొట్టిపాటి ఎద్దేవా 8

## 'పాఠశాల పండుగ'ను విజయవంతం చేయాలి

- మంత్రి లోకేష్ చర్యలతో విద్యాశాఖకు పూర్వవైభవం 7
- మాజీ మంత్రి పీతల సుజాత





## వైసీపీ నేతలకు అండగా ఎస్ఐ అరాచకాలు

- కోనసీమ జిల్లా బాధితుడి గోడు
- ప్రజావినతుల కార్యక్రమానికి వెల్లువెత్తిన ఫిర్యాదులు
- వినతులు స్వీకరించిన మంత్రి అనం, ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ సుజయకృష్ణ రంగారావు 7

# సంపద సృష్టిస్తాం..

# ప్రజలకు పంచుతాం

- నేమకల్లు ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- పేదలకు అండగా, సంక్షేమం నిండుగా..ఇదే ప్రభుత్వ విధానం
- రేషన్ మాఫియాపై ఉక్కుపాదం
- ల్యాండ్, శాండ్, గంజాయి మాఫియాల నుండి రాష్ట్రానికి విముక్తి
- సాంకేతికత అనుసంధానంతో సెల్ ఫోన్‌ల ద్వారా పౌర సేవలు
- హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ




అనంతపురం (చైతన్యరథం): రాష్ట్రంలో సంపద సృష్టి ద్వారా అభివృద్ధి చేస్తూ ఆ ఫలాలను తిరిగి పేదలకు అందజేస్తామని, ఇదే తమ ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాల్ మండలం నేమకల్లు గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో శనివారం మధ్యాహ్నం లబ్ధిదారురాలు పాల్తూరు రుద్రమ్మ ఇంటి వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద 4,000 రూపాయల వితంతు పెన్షన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా అందజేశారు. అనంతరం ఇందిరమ్మ కాలనీలో గ్రామస్తులతో ముచ్చటించి వారితో ఫొటో దిగారు. తదనంతరం అదే కాలనీలో లబ్ధిదారురాలు బోయ భాగ్యమ్మ ఇంటి వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పథకం కింద 15 వేల రూపాయల వికలాంగుల పెన్షన్‌ను స్వయంగా అందజేశారు.

ఆ తరువాత గ్రామంలో ప్రసిద్ధి గాంచిన శ్రీఆంజనేయస్వామి దేవాలయానికి చేరుకుని స్వామి వారిని సీఎం దర్శించుకున్నారు. దేవాలయంలోని స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేసి ముఖ్యమంత్రికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంత రం శ్రీఆంజనేయస్వామి దేవాలయం ఎదురుగా ఏర్పా టు చేసిన ప్రజావేదిక – పేదల సేవలో.. కార్యక్రమం లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. తమ్ముళ్లు హుషారుగా ఉన్నారా... ఆడబిడ్డలూ.. ఆనందంగా ఉన్నారా అంటూ ఆప్యాయంగా పలకరించి ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రతిపక్షనేతగా ఏప్రిల్ 11వ తేదీన అనంతపురం జిల్లాలోని కనేకల్లుకు వచ్చాను. తిరిగి మరల ఈరోజు వచ్చాను. ఆ రోజు నేను 11వ తేదీన వచ్చినందుకు తరువాత జరిగిన ఎన్నికల్లో మీరు 11 సంఖ్యలోనే సీట్లు ఇచ్చి అప్పటి అధికార పక్షాన్ని ఓడించారని చమత్కరించారు. గ్రామాలకు మంచి రోజులు వస్తాయని, మీ బిడ్డలకు ఉద్యోగాలు వస్తాయని, భూకబ్జాలు చేసే వారి భరతం పడతానని ఆ నాడు హామీ ఇచ్చాను. రాయలసీమను రతనాలసీమగా చేస్తామని చెప్పాను. మీ ఆశలు నెరవేర్చేందుకు దేశంలో ఎక్కడా లేనివిధంగా 93 శాతం స్ట్రైక్ రేట్‌తో, 57 శాతం ఓట్లు వేసి కూటమి సర్కార్‌ను గెలిపించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నేరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీఎం చంద్రబాబు అన్నారు.

## పేదలకు అండగా ప్రభుత్వం

వెనుకబడిన అనంతపురం జిల్లాలో రాయదుర్గం ప్రాంతం మరింత వెనుకబడి ఉందని, ఈ ప్రాంతం ఎడారీకరణ జరగకుండా చూసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుని మీ జీవితాల్లో వెలుగు తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతానికి మేలు చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హంద్రీనీవాపై రూ.4,500కోట్లు ఖర్చుపెట్టాం, రాయల సీమలో ఇరిగేషన్‌పై రూ.12,500 కోట్లు ఖర్చు పెట్టాం. ఈ ప్రాంతంలోని భైరవాణితిప్ప ప్రాజెక్టుకు రూ.968 కోట్లు మంజూరు చేసి 35శాతం పనులు పూర్తి చేశాం. తరువాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రాజెక్ట్‌లో మిగిలిన పనులను పూర్తిచేసే బాధ్యత మా ప్రభు త్వం తీసుకుంటుంది. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసేలా ఆత్మస్థైర్యాన్ని, శక్తిని, ధైర్యాన్ని, తెలివితేటలు ఇవ్వాలని మీ ఊరి ఆంజనేయస్వామిని ప్రార్థించాను. పేదల పక్షాన ఉండాలనేదే ఎప్పుడూ నా ఆలోచన. కష్టాల్లో ఉన్నవారికి పూర్తిగా అండగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లను నెలకు 3,000 నుంచి 4 వేలకు పెంచి ఏప్రిల్, మే, జూన్ నెలల అరియర్స్‌తో కలిపి అందించాం. రాష్ట్రంలో 64లక్షల మంది లబ్ధిదారులకు పింఛన్లను ఇస్తున్నాం. పింఛన్ల రూపంలో ఐదు నెలల కాలంలో రూ.18 వేల కోట్లు పేదలకు ఇవ్వడం ద్వారా నా జీవితం ధన్యమైంది. 64 లక్షల మందికి నెలకు 2,790 కోట్లు ఖర్చు చేస్తున్నాం. సంవత్సరానికి రూ.53,099 కోట్లు పింఛన్లపై ఎన్డీఏ ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. లబ్ధిదారులు 1, 2నెలల పెన్షన్లు తీసుకోక పోయినా మూడు నెలల మొత్తం కలిపి ఒకేసారి చెల్లి స్తాం. పింఛన్‌దారు ఎవరైనా చనిపోతే వారి భార్యకు కూడా వెంటనే వితంతు పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా కేటగిరీని బట్టి 4,000, 6,000, 10,000, 15,000 రూపాయల ప్రకారం పెన్షన్లు ఇస్తున్నాం. అలా పేదవారికి సహాయం చేస్తున్న ప్రభుత్వం మాదే. ఏ రాష్ట్రంలో కూడా మన రాష్ట్రం ఇచ్చినంత మొత్తంలో పెన్షన్లు ఇవ్వడం లేదు.



కర్ణాటకలో 1,200, కేరళలో 1,600, ఒడిశాలో 700, తెలంగాణలో 2,000, మధ్య ప్రదేశ్, వెస్ట్ బెంగాల్లో వెయ్యి రూపాయలు చొప్పున పెన్షన్లు ఇస్తున్నారు. అన్ని రాష్ట్రాల కన్నా అధికంగా మన రాష్ట్రంలో పెన్షన్లను ఇస్తున్నాం. ఈ వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలి. అధికారంలోకి రాగానే ఉద్యోగుల మాదిరిగానే ప్రతినెలా ఒకటవ తేదీనే పెన్షన్లను అందించే ఏర్పాటు చేశాం. ఒకటో తేదీ సెలవు రోజు ఉన్న కారణంగా ముందు రోజు 30వ తేదీనే పెన్షన్లను మీ ఇంటి వద్దకు వచ్చి అందిస్తున్నాం. రాబోయే రోజుల్లో పింఛన్ల పంపిణీకి సంబంధించి నేరుగా లబ్ధిదారులకు నేను ఫోన్ చేస్తాను. ఆలస్యంగా ఇస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. పింఛన్ల పంపిణీ బాధ్యతగా చేపట్టాలని అధికారయంత్రాంగాన్ని ఆదేశించాను. పింఛన్ల పంపిణీ అవినీతి రహితంగా చేయాలని, మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని ఆప్యాయంగా పలకరించి పింఛన్లను అందజేయాలని ఆదేశించాం. అందుకే ఈ కార్యక్రమానికి పేదల సేవలో అని నామకరణం చేశామని సీఎం చంద్రబాబు తెలిపారు.

## రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడతాం

గత ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. విధ్వంస పాలన చేశారు. తవ్విన కొద్దీ అవినీతి, అప్పులు కనబడుతున్నాయి. రూ. 10 లక్షల కోట్లు అప్పు చేశారు. అయినా కూడా ఉద్యోగుల జీతాలు సక్రమంగా ఇచ్చేవారు కాదు. మద్యపాన నిషేధం చేస్తానని అధికారంలోకి వచ్చి మద్యంపై 25 సంవత్సరాల ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పులు తీసుకువచ్చారు. చాలా దుర్మార్గమైన పనులు చేశారు. ఎమ్మార్వో కార్యాలయాలను, ఆసుపత్రులను సైతం తాకట్టు పెట్టారు. నాకున్న అనుభవంతో మళ్ళీ రాష్ట్రాన్ని గట్టెక్కిస్తాం. ఇందుకోసం ఆరు నెలలుగా శ్రమిస్తున్నా. ముఖ్యమంత్రి అయ్యాక తొలి 5 సంతకాలలో ఒకటి డీఎస్సీ ఫైల్‌పై పెట్టాను. త్వరలో పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. పింఛన్ల పెంపుపై, అన్న క్యాంటీన్ల పున:ప్రారంభం ఫైళ్లపై తరువాత సంతకాలు పెట్టాను. అన్న క్యాంటీన్లలో పేదలందరూ ఐదు రూపాయలకే కడుపు నిండా తింటున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 195 అన్న క్యాంటీన్లు ప్రారంభించి ఒక కోటి 25 లక్షల మందికి ఆహారం అందజేసిన ఘనత మాకు దక్కుతుంది. ఆడబిడ్డల కష్టాలు చూడలేక గతంలో మా ప్రభుత్వంలో ఉచితంగా దీపం గ్యాస్ కింద కనెక్షన్లు ఇచ్చాం. ప్రస్తుతం దీపం-2 పథకం కింద మహిళలకు సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేస్తున్నాం. ఇందుకోసం ఆధార్, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. రైతులకు మేలు కలిగేలా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. భూ కబ్జాల నిరోధానికి ఆంటీ ల్యాండ్ గ్రాబింగ్ ఆక్ట్ తీసుకొచ్చాం. మీ భూమి జోలికి వస్తే కబ్జాదారుల తాట తీస్తాం. భూ రికార్డులు కూడా గత పాలకులు ఇష్టానుసారంగా మార్పు చేశారు. ప్రభుత్వానికి అందే అర్జీల్లో 40 నుంచి 50 శాతం పిటిషన్లు భూ సమస్యలపైనే వస్తున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు.

## గంజాయి కట్టడికి చర్యలు

గత పాలకులు మద్యాన్ని కూడా సొంత ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ప్రస్తుతం దానిని ప్రభుత్వ ఆదాయంగా మారుస్తున్నాం. కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యానికి అడ్డుకట్ట వేసి నాణ్యమైన మద్యాన్ని అందిస్తున్నాం. మద్యం తయారీ నుంచి షాపుల్లో అమ్మకాల వరకు వారి మనుషులని పెట్టి అందినకాడికి దోచుకున్నారు. మద్యం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరిగితే సంక్షేమ కార్యక్రమాలకే ఉపయోగపడుతుంది. మద్యం దోపిడీకి అడ్డుకట్ట వేశాం. బెల్టు షాపులను సహించేది లేదు. మద్యం వ్యాపారంలో తల దూరిస్తే ఏ నాయకుడినీ ఉపేక్షించేది లేదు. ఇసుక ప్రకృతి ఇచ్చిన వరం. దానిలో కూడా గత ప్రభుత్వం దందాలు చేసి వేల కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడింది. గత ప్రభుత్వ దోపిడీతో ఇసుక అందుబాటులో లేక 45 లక్షల మంది భవన కార్మికులు ఉపాధి లేకుండా ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చింది. ఇసుక ప్రజలందరిదీ. ఎద్దుల బండి, ట్రాక్టర్లు తీసుకెళ్లి ఉచితంగా ఇసుకను తెచ్చుకోండి. ఇసుకలో ఏ నాయకుడైనా తలదూర్చి దందాలు చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటా. ఇంకొక వైపు గత ప్రభుత్వ హయాంలో

- (మిగతా వివరాలు 3లో)

చైతన్యరథం

# రాయదుర్గంపై సీఎం చంద్రబాబు వరాల జల్లు

- ఆదర్శ గ్రామంగా నేమకల్లు అభివృద్ధి
- నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కుళాయి నీరు
- ఎడారీకరణ అడ్డుకుంటాం
- పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేస్తాం
- పీఎం సూర్యఘర్ కింద ఉచితంగా సోలార్ ప్యానల్స్ అందిస్తాం
- జీడిపల్లి, బైరవానితిప్ప ప్రాజెక్టు పూర్తిచేస్తాం

అనంతపురం (చైతన్యరథం): అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంపై సీఎం చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. నియోజకవర్గంలోని బొమ్మనహల్ మండలం నేమకల్లు గ్రామంలో శనివారం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన అనంతరం ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ గ్రామంలో 112 మందికి ఇండ్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. అర్హులందరికీ పింఛన్లు ఇస్తాం. కొత్త రేషన్ కార్డులు కూడా జారీ చేస్తాం. ఇంటింటికీ కుళాయిలను వేసి సురక్షితమైన మంచినీరు ఇస్తాం. ప్రస్తుతం పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇంట్లోనే కరెంటును తయారు చేసుకునే అవకాశం ఉంది. మీ ఇంట్లో ఉత్పత్తి అయిన విద్యుత్తులో మీ వాడకానికి పోను మిగిలినది గ్రిడ్‌కు ఇచ్చే అవకాశం ఉంటుంది. గ్రామంలో 759 కుటుంబాలకు సోలార్ ప్యానల్స్ పెట్టుకునే అవకాశం ఉంది. మీకందరికీ ఉచితంగా సోలార్ ప్యానళ్లు పెట్టించే ఏర్పాటు చేస్తాం. ఇందు కోసం రెస్కో కింద సంస్థను ఏర్పాటు చేసి రుణాలు అందిస్తాం. ఊరంతా సిమెంట్ రోడ్లు, మురికి కాలువలు ఉండాలి. ఎక్కడా అపరిశుభ్రత ఉండకూడదు. చెత్తను కాంపోస్టుగా తయారు చేయాలి. మరలా మీ గ్రామానికి తనిఖీకి వస్తా. ఈ గ్రామాన్ని పరిశుభ్రమైన గ్రామంగా తయారుచేసే బాధ్యత తీసుకుంటా. మినీ గోకులాలు ఎన్ని కావాలన్నా మంజూరు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

## ఎడారీకరణ అడ్డుకుంటాం

ఈ ప్రాంతంలో జీడిపల్లి - బైరవానితిప్ప ప్రాజెక్ట్ అర్ధాంతరంగా ఆగిపోయింది. దాన్ని పూర్తి చేస్తే చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఆ బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తాం. నేమకల్లు - గుంతకల్లు మధ్య అయిదు టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ ను మంజూరు చేస్తున్నాం. దాని ద్వారా ఈ ప్రాంత పరిసర గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారం అవుతుంది. హంద్రీనీవా 36 ప్యాకేజీలో మాల్యం- అవలదట్ల మధ్య తలపెట్టిన బ్రాంచ్ కాలువను పటిష్టం చేస్తాం. రాయదుర్గం మున్సిపాలిటీ ఇబ్బందుల్లో ఉందని చెప్పారని, ప్రత్యేక నిధులు ఇచ్చి ఆదుకుంటాం. రాయదుర్గం నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా నీటిని అందిస్తాం. బొమ్మనహాల్‌లో 25,000 ఎకరాల్లో ఇసుక మేటలు, దిబ్బలు ఉన్నాయి. ఇవి ప్రతి సంవత్సరం అర కిలోమీటర్ పెరుగున్నాయి. ఇసుక మేటలు, దిబ్బలు పెరగకుండా చర్యలు తీసుకుంటాం. ఈ ప్రాంతాన్ని ఎడారిగా మారకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటాం. వేదవతి - హగరిలో సబ్ సర్ఫేస్లు కావాలని అడిగారు. ఏర్పాటుచేస్తాం.. డి.హీరేహాల్లో పర్కులేషన్ ట్యాంకులు ఏర్పాటు చేస్తాం. నేమకల్లు- డి.హీరేహాల్ మధ్యలో ఒక పారిశ్రామిక కస్టర్ ఏర్పాటు చేస్తాం. బొమ్మనహాల్ మండలం శ్రీధరగట్ట గ్రామానికి తుంగభద్ర ఎగువ కాలువ ద్వారా నీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రతి నియోజకవర్గంలో అక్కడి ప్రత్యేక పరిస్థితులను పరిగణలోకి తీసుకొని 100 ఎకరాల నుంచి వేల ఎకరాల్లో పరిశ్రమలు తెచ్చే బాధ్యత కూడా ప్రభుత్వం తీసుకుంటుంది. ఇక్కడ ఇనుప ఖనిజం ఉంది. అనుబంధ పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంది. వీటన్నిటిని సాకారం చేయడానికి పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటాం. నేమకల్లు ఆంజనేయ స్వామి గోపురానికి సిజిఎఫ్ కింద రూ.3కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేస్తాం. పిల్లలు బాగా చదువు కుంటున్నారని ఈ ప్రాంతానికి బిసి రెసిడెన్షియల్ పాఠశాల కావాలని కోరారు. దానిని కూడా మంజూరు చేస్తున్నాం. ఈ గ్రామంలో 98శాతం మందికి బ్యాంకు అకౌంట్లు ఉన్నాయి. దానిని పూర్తిగా 100శాతం చేయాలి. జిపిఎస్ మ్యాపింగ్ చేశాం. కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ప్రభుత్వ పథకాలు అందజేస్తాం. సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు మరింత కృషి చేస్తాం. మీ ఇంటికే పౌర సేవలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. సంపద సృష్టించి ఆ సంపదను పేద వాళ్లకు అందజేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు.



## ఆదర్శ గ్రామంగా నేమకల్లు

శ్రావణమాసం శనివారాల్లో ఈ జిల్లాలో ప్రసిద్ధి చెందిన మూడు ఆంజనేయస్వామి ఆలయాలు... మురడి, నేమకల్లు, కసాపురంల్లోని ఆలయాలను సమన్వయం చేస్తూ ఒకే రోజు దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకున్నామని, అది కొనసాగుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. మీ ఆశయాలు నెరవేర్చడానికి అనునిత్యం పనిచేస్తాం. మీలో కూడా చైతన్యం రావాలి. టెక్నాలజీని తీసుకొస్తాం... దానిని మీరు సద్వినియోగం చేసుకోవాలి. నేమకల్లును ఆదర్శ గ్రామంగా తయారు చేయడానికి ప్రతిపాదన రూపొందించాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నా. గ్రామంలో అభివృద్ధిపై ప్రతి సంవత్సరం సమీక్షిస్తా. నేను చూసిన గ్రామాలను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అభివృద్ధి చేస్తా. మీరు చూపిన అభిమానానికి కృతజ్ఞతగా మీ అభివృద్ధికి దోహదపడేలా కష్టపడతానని సీఎం చంద్రబాబు చెప్పారు.

ఈసందర్భంగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు.. సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి కలిసి ఉన్న చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేసి ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పథకం పెన్షన్ లబ్ధిదారురాలు భాగ్యమ్మ కుటుంబానికి ఆర్థికంగా ఆదుకోవడానికి రెండు లక్షల రూపాయల చెక్కును రాష్ట్ర ముఖ్యమంత్రి అందజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సంపద సృష్టిస్తాం.. ప్రజలకు పంచుతాం

(2వ పేజీ తరువాయి)

ఎక్కడ చూసినా గంజాయి పంట యథేచ్ఛగా సాగయ్యేది. విశాఖపట్నంను గంజాయి రాజధానిగా మార్చారు. కూటమి ప్రభుత్వం గంజాయి కట్టడికి పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. ఎవరైనా గంజాయి పండించినా, అమ్మినా అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నా. గంజాయి పండించినా, అమ్మినా, మత్తు పదార్థాలు అమ్మినా ఖబడ్దార్.. డేగ కన్నుతో పరిశీలిస్తున్నాం. గంజాయి కట్టడికి దానిపై ఈగల్ పేరుతో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేశాం. ఈ రాష్ట్రంలో ల్యాండ్ మాఫియా, శాండ్ మాఫియా, గంజాయి మాఫియా లేకుండా చేస్తాం. పేదలకు ఉచితంగా బియ్యం ఇస్తే ఆ బియ్యాన్ని కూడా తీసుకుపోయి విదేశాలకు అమ్ముకునే దుర్మార్గమైన పనులకు పాల్పడుతున్నారు. పేదల బియ్యం రీసైకిలింగ్ చేసే వారిని హెచ్చరిస్తున్నా. ఎవరైనా అలాంటి కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. గత పాలకులు చెత్త మీద పన్ను వేశారు. అయినా 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని, గతంలో మా ప్రభుత్వంలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను ఏర్పాటు చేస్తే వాటిని నిర్వీర్యం చేశారు. మా ప్రభుత్వంలో గ్రామాలను పరిశుభ్రంగా తయారు చేస్తాం. బీసీలు అంటేనే తెలుగుదేశం పార్టీ.

టీడీపీ ప్రభుత్వాలు మొదటినుంచీ బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నాయి. ఇక్కడ ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను బోయ కులానికి ఇచ్చాం. రాష్ట్రంలో 10 శాతం మద్యం షాపులని గీత కార్మికులకే కేటాయిస్తున్నాం.

ఆలయాల్లో అర్చకులకు పదివేల నుంచి 15,000 కు జీతాలు పెంచాం. నాయీ బ్రాహ్మణుల వేతనాన్ని రూ.15,000 నుంచి 25000 చేశాం. ఆలయాలకు ధూప, దీప నైవేద్యాల కోసం ఇచ్చే మొత్తాన్ని ఐదువేల నుంచి పదివేల రూపాయలకు పెంచాం చేనేతపై జీఎస్టీ ఎత్తివేసాం. చేనేతలు ఇల్లు కట్టుకుంటే 50,000 అదనంగా ఇస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.



## ఆన్ లైన్‌లో పౌర సేవలు

రెవిన్యూలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా కేవలం సెల్‌ఫోన్‌లో ఒక మెసేజ్ పెడితే మీకు పంపించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. దాదాపు 150 పౌరసేవల్ని ఆన్‌లైన్‌లో పెట్టి టెక్నాలజీ ద్వారా మీకు సేవలు అందజేసే ఏర్పాటు చేస్తున్నాం. అన్ని సేవలు ఆన్‌లైన్‌లో పెడుతున్నాం. ప్రజలకు ఫోను చేసి వారి స్పందన అడుగుతాం. వాస్తవాలు చెప్పాలి. తద్వారా మరింత మెరుగైన సేవలకు ఆస్కారం ఉంటుంది. ఫోన్‌లో వాట్సాప్ మెసేజ్ పెడితే ధాన్యం సేకరించే ఏర్పాటు చేశాం. సేకరించిన తరువాత 48 గంటల్లో ఆ డబ్బులు రైతుల అకౌంట్లో వేస్తున్నాం. ఆ తర్వాత ఫోన్ చేసి రైతులకు సౌకర్యంగా ఉందా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయని తెలుసుకుంటున్నామని సీఎం చంద్రబాబు అన్నారు.

## ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా..

గత పాలకులు రాష్ట్రాన్ని గుంతల మయంగా చేసి వెళ్లారు. రోడ్లపై గుంతలు పూడ్చేందుకు మా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. సంక్రాంతిలోపు పనులు పూర్తి చేస్తాం. ఆర్ అండ్ బి రోడ్లకి రూ. 861 కోట్లు శాంక్షన్ చేశాం. మరో 500 కోట్ల రూపాయలు ఇస్తున్నాం. ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తున్నాం. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఎక్కువ ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలకు ఎక్కువగా ప్రోత్సాహకాలు ఇస్తాం.

ఒకప్పుడు ఈజ్ ఆఫ్ బిజినెస్ డూయింగ్ అన్నా. ప్రస్తుతం స్పీడ్ అఫ్ బిజినెస్ డూయింగ్ అంటున్నా. త్వరలో నైబర్హుడ్ కాన్సెప్ట్ తీసుకొస్తున్నాం. ఇంట్లోనే ఉండి యువత సెల్‌ఫోన్ ద్వారా డబ్బులు సంపాదించే మార్గం చూపిస్తాం. దాంతో కుటుంబాలు బాగుపడతాయి. మహిళలలో కూడా చదువుకున్న వారు ఉన్నారు. ఇంట్లో పని చేసుకుంటూనే తీరిక సమయంలో ఐదారు గంటలు పని చేయగలిగితే వారు కూడా డబ్బులు సంపాదించే అవకాశం చూపిస్తాం. ఇందుకు ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని సీఎం చంద్రబాబు కోరారు.

## నెంబర్ వన్‌గా రాష్ట్రం

రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తాం. తాడిపత్రి నుంచి ఒక ట్రైన్ వేసి ఇక్కడి నుంచి విదేశాలకు అరటిని ఎగుమతి చేస్తున్నారంటే అదే టీడీపీ ప్రభుత్వ దూర దృష్టి. దీనిని ప్రజలు అర్థం చేసుకోవాలి. అనంతపురం జిల్లాకు కియా పరిశ్రమ వచ్చింది మా హయాంలోనే. హంద్రీ నీవా, హెచ్ఎల్సీ ఆధునీకరణతో నీటి కొరత తీర్చేందుకు కృషి చేస్తున్నాం. విజన్- 2047 డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. 2047కు దేశంలోనే మన రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా తయారు చేసేందుకు కృషి చేస్తున్నాం. పేదరిక నిర్మూలన కొరకు కృషి చేస్తున్నాం. గతంలో అప్పటి పరిస్థితుల దృష్ట్యా కుటుంబ నియంత్రణ గురించి చెప్పాను. కానీ ప్రస్తుతం యువత తగ్గుతుండడంతో... జనాభాను పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాం. మన కుటుంబమే మన ఆస్తిగా తయారవుతుంది. ప్రతి కుటుంబానికి ఏమేమి ఇవ్వాలో అవన్నీ ఇచ్చేందుకు ఆలోచిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.



# చంద్రన్నా..
# నీవే మా తోడన్నా!
## ఇది పేదల గుండె చప్పుడు



మా... ఇంటికొచ్చావా మారాజా..
కాదమ్మా మనింటికొచ్చా.. మీ చంద్రబాబునొచ్చా...

ఇటీవల ఈ సన్నివేశాలు.. తరచూ కనిపిస్తున్నాయి. కోట్లకు పడగలెత్తిన వారికి కూడా సాకారం కాలేని దృశ్యాలు.. సామాన్యుల ఇళ్లల్లో సాక్షాత్కరించడం.. అందరినీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతున్నాయి.

సీఎం చంద్రబాబు అంతరాళాల్లో దాగివున్న వాత్సల్యం ఆయన కొత్త ఆలోచనలతో వెలుగు చూస్తోంది.. వెల్లి విరుస్తోంది.. ఉరకలేస్తోంది. ఉప్పొంగుతోంది. ఈయన ముఖ్యమంత్రి చంద్రబాబేనా అని అనుకునేలోపే కాదు మీ చంద్రబాబును అంటూ గుండె గుడిలోకి ఆప్యాయంగా చొరబడి పోతున్నారు. ప్రపంచంలోని ఎన్నో దేశాలను తన రాజకీయ చాతుర్యంతో స్పృశించిన చంద్రబాబు తాను సాధించిన అభివృద్ధి ఫలాలను అందుకుంటున్న సామాన్యుల ఆవాసాల్లోకి తరచి చూస్తున్నారు. బీద, బడుగుల పూరిళ్లవైపు అడుగులేస్తున్నారు. నెలకోసారి పేదల ఇళ్లకు నేరుగా వెళుతున్నారు. వారి జీవితాల్లోకి తొంగి చూస్తున్నారు. వారితో కలగలిసి పోతున్నారు. ముచ్చట్లాడుతున్నారు. ఎవరి జీవితాలు బాగుపడాలని మనసులో అనుకున్నారో.. ఆటు వైపు మళ్లుతున్నారు. ఇప్పుడు ఏకంగా పేదల ఇంట్లోకి వెళ్లిపోయి తానొక రాష్ట్రానికి ముఖ్యమంత్రినని మరిచిపోయి.. ఇల్లంతా కలియ తిరిగేస్తున్నారు. ఎక్కబడితే అక్కడ కూర్చుంటున్నారు. ఇంటికొచ్చిన చంద్రబాబును చూసిన అవ్వా, అమ్మా, తమ్ముడూ, చెల్లీ... ముందు కంగారు పడుతున్నారు. దండాలు పెడుతున్నారు. తేరుకునే లోపే ఆయన కలుపుగోలుతనానికి మైమరిచి పోతున్నారు. సొంత కొడుకులా తమ్ముడిలా, మనవడిలా అనేసుకుని మీద చనువుగా చేతులేసేస్తున్నారు. చేయీ చేయీ కలిపి కష్ట సుఖాలను మాటలతో ఒలకబోసేస్తున్నారు.

అయితే చంద్రబాబు మనసెరిగిన వారు.. ఆయన విజన్ తెలిసిన వారు మాత్రం.. ఆయన వేస్తున్న అడుగు మాత్రం బడుగు జీవులకు బాసటేనని భావిస్తున్నారు. ఇక వారి జీవితాలు సాయం అందుకునే సామాన్యుల్లా కాకుండా వారే ఎదుటి వారికి సాయం చేసేలా మారతాయని ఘంటా భజాయిస్తున్నారు.





















# ఎన్నారై పెట్టుబడులకు వారధిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**- అమెరికా పారిశ్రామిక వేత్తలతో కలిసి సీఎం చంద్రబాబుతో భేటీ**



అమరావతి (చైతన్యరథం): అమెరికా పారిశ్రామిక వేత్తలకు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ వారధిగా నిలుస్తున్నారు. అమెరికా పారిశ్రామిక వేత్తలతో ఉన్న సంబంధాలతో వారిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో కలుపుతూ రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో అమెరికా పారిశ్రామిక వేత్తలైన విమల్ కుమార్ కొలప్ప, శ్రీ సాయి కిరణ్ కొలవెన్ను లను సీఎం చంద్రబాబుకు పరిచయం చేశారు. రాష్ట్రానికి ఎన్నారై పెట్టుబడులు తీసుకు వచ్చేందుకు, రాష్ట్రంలో ఆగ్రో ఫామ్స్ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రయత్నాలను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు అండగా ఉంటానని భరోసానిచ్చారు.

# తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

- **ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి**
- **అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు**

అమరావతి (చైతన్యరథం): వేగంగా దూసుకొస్తున్న ఫెంగల్ తుపానుపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. తుపాను పరిస్థితులపై శనివారం ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా కలెక్టర్లు, సీఎంఓ, రియల్ టైం గవర్నెన్స్ అధికారులతో సీఎం సమీక్ష జరిపారు. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు రియల్ టైంలో అంచనా వేసి అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీజీ ద్వారా నిరంతర పర్యవేక్షణతో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

అన్ని స్థాయిల్లో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని పూర్తి సమన్వయంతో పని చేయాలని సూచనలు జారీ చేశారు. తుపాను కారణంగా ఆకస్మిక వరదలు వస్తాయనే సమాచారం నేపథ్యంలో ఆయా జిల్లాల అధికారులు.. డిజాస్టర్ టీంలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ముందు నుంచే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలకు సమాయత్తం కావాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు. తుపానుపై ధాన్యం



రైతులు ఆందోళనగా ఉన్నారని, నిర్దిష్టమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అన్నదాతలకు చేరవేయాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

# పెన్షన్ల పెంపు ఘనత చంద్రబాబుదే

- **హామీని అమలు చేసి మాట నిలబెట్టుకున్నారు**
- **రాష్ట్రంలో ఒకరోజు ముందే పెన్షన్ల పండుగొచ్చింది**
- **దేశంలోనే అత్యధిక పెన్షన్ ఇస్తున్న ఘనత మనకే దక్కింది**
- **జగన్‌రెడ్డి రూ.3 వేల హామీకి తూట్లు పొడిచి దగా చేశారు**
- **గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం(చైతన్యరథం): పెన్షన్ పథకాన్ని ప్రారంభించి దేశంలోనే అత్యధిక పెన్ష న్ ఇస్తున్న ఘనత తెలుగుదేశం పార్టీకి మాత్రమే సాధ్యమవుతుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగానే పెన్షన్లు అందించి లబ్దిదారుల్లో ఆనందం నింపిన ఘనత కూటమి ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందన్నారు. మచిలీపట్నంలో శనివారం పలువురు వృద్దులు, దివ్యాంగులకు మంత్రి పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.నాడు ఎన్టీఆర్ రూ.30 రూపాయలతో పెన్షన్ ప్రారంభిస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు క్రమంగా పెంచుతూ రూ.2000 చేశారు.. జగన్‌రెడ్డి రూ.3000 ఇస్తానని ఐదేళ్లు నాన్చి దగా చేసి విడతల వారీగా పెన్షన్ అంటూ వృద్ధులను వచ్చి మోసం చేశాడని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హామీ నిలబెట్టుకుంటూ పెన్షన్ మొత్తాన్ని రూ.4వేలకు పెంచడమే కాకుండా ఏప్రిల్ నుంచి పెంచిన మొత్తం ఇవ్వడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. దేశంలోనే 65 లక్షల మందికి రూ.4000 పెన్షన్ అందించే ఏకైక ప్రభుత్వం కూటమి అని ప్రశంసించారు. దివ్యాంగులకు రూ.6000, పూర్తి వైకల్యం కలిగిన వారికి రూ.15 వేలు, కిడ్నీ రోగులకు పెన్షన్ పెంచి అందిస్తున్నామన్నారు. పేదలకు అండగా వారు శాశ్వతంగా ఆనందం చూడాలన్నదే చంద్రబాబు లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# పసుపు సైనికుడు మిర్జా మొహమ్మద్ అలీ మృతి బాధాకరం

- **సీఎం చంద్రబాబు సంతాపం**
- **కుటుంబానికి అండగా ఉంటామని హామీ**



అమరావతి(చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త, పసుపు సైనికుడు మిర్జా మొహమ్మద్ అలీ మృతి బాధాకరమని సీఎం చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణాజిల్లా, పమిడిముక్కల మండలం, అలినఖీ పాలెం గ్రామానికి చెందిన మొహమ్మద్ అలీ శనివారం ఉదయం కన్నుమూశారు. 1983నుంచి అలీ కార్యకర్తగా ఉంటూ పార్టీ కోసం నిరంతరం పనిచేశారని సీఎం చంద్రబాబు అన్నారు. ఎప్పుడు పార్టీ కార్యాలయానికి వెళ్లినా పసుపు దుస్తుల్లోనే కనిపించి పార్టీ పట్ల తన అభిమానాన్ని చాటుకునేవారని గుర్తుచేసుకున్నారు. మహమ్మద్ అలీ కుటుంబానికి అండగా ఉంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

మిర్జా మొహమ్మద్ అలీ(పార్టీ ఆవిర్భావం నుంచి అనగా 1983 నుంచి కార్యకర్తగా పనిచేసి, అంచలంచలుగా ఎదుగుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన ఆధ్వర్యంలో పమిడిముక్కల మండలంలో తెలుగుదేశం పార్టీ అనేక విజయాలని సాధించింది. పార్టీ అధికారంలో ఉన్న లేకున్నా వారు అంకితభావంతో పార్టీ కోసం పని చేస్తూ నిత్యము పసుపు రంగు చొక్కా అని ధరించి తన నిబద్ధతను చాటుకునేవారు.

### పార్టీకి తీరని లోటు: మంత్రి లోకేష్

తెలుగుదేశం పార్టీ వీరాభిమాని, అన్న ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకూ పసుపు జెండా భుజాన మోసిన అంకిత భావం కలిగిన టీడీపీ సైనికుడు అలీ మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సంతాపం తెలియజేశారు. మిర్జా మొహమ్మద్ అలీ గారు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీయే ప్రాణంగా భావిస్తూ పనిచేశారన్నారు. ఎల్లప్పుడూ తెలుగుదేశం పార్టీ రంగు పసుపు దుస్తులనే ధరించే అలీ సాబ్ లేని లోటు తీరనిదంటూ, ఆయన కుటుంబసభ్యులకు మంత్రి లోకేష్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**వృద్ధులను జగన్‌రెడ్డి వంచిస్తే..**

# చంద్రబాబు అక్కున చేర్చుకున్నారు

- **పెన్షన్లు పెంచి నిరుపేదల కన్నీళ్లు తుడుస్తున్నారు**
- **ఒకటో తేదీ వస్తోందంటే పండుగ వాతావరణం**
- **ఆ తేదీ ఆదివారం వస్తే ఒకరోజు ముందే పంపిణీ**
- **అమెరికా కేసు నుంచి జగన్‌రెడ్డి తప్పించుకోలేరు**
- **త్వరలో తాడేపల్లి ప్యాలెస్‌కు టూలెట్ బోర్డు ఖాయం**
- **రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్**

అమరావతి(చైతన్యరథం): పెన్షన్ పేరుతో వృద్ధులను జగన్‌రెడ్డి వంచిస్తే.. సీఎం చంద్రబాబు మాత్రం పేదలను అక్కున చేర్చుకున్నారని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతినెలా ఒకటో ప్రతి ఇంటి లోగిళ్లలో పండుగ వాతావరణం కనిపిస్తోందని.. గత ప్రభుత్వానికి భిన్నంగా పేదలకు భరోసా కల్పిస్తూ చంద్రబాబు వారి కన్నీళ్లు తుడుస్తున్నారని తెలిపారు. నాడు అవ్వాతాతలకు జగన్‌రెడ్డి డబ్బులు ఇచ్చినట్లే ఇచ్చి పన్నుల భారం మోపడంతో వారి కళ్లలో బాధ తప్పించి ఆనందం లేదన్నారు. నేడు ప్రతినెలా ఒకటో తేదీ వస్తుందంటే చాలు అవ్వాతాతల కళ్లల్లో అవధులు లేని ఆనందం కనపడుతుందన్నారు. ఒకటో తేదీ ఆదివారం వస్తే పెన్షన్ అందక పేద ప్రజలు ఎక్కడ ఇబ్బంది పడతారోనని తల్లడిల్లి ఒకరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి నాంది పలికిన తొలి నాయకుడు సీఎం చంద్రబాబు అని ప్రశంసించారు. జగన్ ప్రభుత్వం పెన్షన్లను ఆపి కాంట్రాక్టర్లకు ముందస్తు చెల్లింపులు చేస్తే.. కూటమి ప్రభుత్వం పేదలకు ఒకరోజు ముందే పింఛన్లు ఇస్తుందని తెలిపారు. ఎక్కడా అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. వర్షాలను సైతం లెక్క చేయకుండా ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందిస్తున్న సిబ్బందికి అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశం దృష్టిని సైతం ఆకర్షిస్తున్నాయని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలపై నేడు విషం చిమ్ముతున్న వారిని ప్రజలు ఏనాడో



ఛీకొట్టారు.. ఇక ఎన్ని ఎత్తులు వేసినా జగన్‌రెడ్డి అమెరికా కోర్టులో ముద్దాయిగా తేలడం తథ్యం.. త్వరలో తాడేపల్లి ప్యాలెస్‌కు టూలెట్ బోర్డు పెట్టడం ఖాయమని స్పష్టం చేశారు.

# తీరం దాటిన 'ఫెంగల్'

**- పలు జిల్లాల్లో భారీ వర్షాలు - నేడూ వర్ష సూచన**

అమరావతి (చైతన్యరథం): ఫెంగల్ తుపాను పుదుచ్చేరి సమీపంలో తీరాన్ని తాకింది. మహాబలిపురం-కరైకల్ మధ్య పుదుచ్చేరి సమీపంలో శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో తుపాను తీరం దాటే ప్రక్రియ ప్రారంభమైనట్లు భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ఈ ప్రక్రియకు దాదాపు 4 గంటలు పట్టే అవకాశముందని ఐఎండీ అంచనా వేసింది. గడచిన 6 గంటల్లో గంటకు 7 కి.మీ వేగంతో కదిలిన ఫెంగల్ తుపాను తరువాత తీవ్ర వాయుగుండంగా బలహీనపడుతుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. కోస్తాంధ్రలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. తుపాను తీరం దాటే సమయంలో 70 నుంచి 80 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. తిరుపతి, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో చాలా చోట్ల ఆదివారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దాదాపు 20 సె.మీ వర్షపాతంతో పాటు ఆకస్మిక వరదలు వచ్చే అవకాశముందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణసంస్థ అధికారులు తెలిపారు. చెన్నై, పుదుచ్చేరిలో బలమైన ఈదురుగాలులతో పాటు, భారీ వర్షాలు కురిశాయి.

### అధికారులతో మంత్రి గొట్టిపాటి టెలీకాన్ఫరెన్స్

ఏపీలో తుపాన్ ప్రభావంతో వర్ష సూచన నేపథ్యంలో అధికారులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ అప్రమత్తం చేశారు. నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం నాలుగు జిల్లాల్లో పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భారీవర్షం, ఈదురుగాలులతో విద్యుత్ స్తంభాలు ఒరిగే ప్రమాదం ఉంటుందని, ప్రజలు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమస్యపై ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించాలన్నారు. విద్యుత్ సరఫరాకు అవాంతరాలు ఏర్పడితే తక్షణం పునరుద్ధరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.





అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాల్ మండలం నేమకల్లు గ్రామంలో లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేసి, ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు.















### రేపటి నుంచి అర్జీల స్వీకరణ కార్యక్రమం

# పాల్గొనే మంత్రులు, నాయకుల షెడ్యూల్

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ప్రజావేదిక లో భాగంగా ఈ నెల 2న సోమవారం నుంచి 14వ తేదీ వరకు అర్జీల స్వీకరణ కార్యక్ర మం జరుగుతుంది. పాల్గొనే మంత్రులు, నాయకుల వివరాలను కార్యాలయం వెల్లడిం చింది. ప్రజలు, పార్టీ శ్రేణులకు వారు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపింది. ప్రజావేదికలో పాల్గొనే మంత్రులు, నాయకుల వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 2న ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు చైర్మన్ కె.కె.చౌదరి, 3న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, టీటీడీ బోర్డ్ సభ్యుడు జంగా కృష్ణమూర్తి, ఏపీ శెట్టి బలిజ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, 4న ఎమ్మెల్యే బాదేటి రాధాకృష్ణ, ఏపీ గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ కిడారి శ్రావణ్, పర్యావరణ నిర్వహణ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి, 5న హోంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్సీ దువ్వారపు రామారా వు, ఏపీ ఆర్యవైశ్య సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, 6న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్సీ బి.టి.నాయుడు, 7న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, ఏపీ గౌడ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, 9న కార్మిక సంక్షేమ మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ జాతీయ ప్రధా న కార్యదర్శి కంభంపాటి రామ్మోహన్ రావు, టీడీపీ పార్లమెంట్ ప్రెసిడెంట్ మల్లెల రాజ శేఖర్ గౌడ, 10న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, ఏఎంయుడీఏ చైర్మన్ స్వామినాయుడు, 11న పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు కావలి ప్రతిభాభారతి, ఏపీటీఎస్ఎల్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, 12న రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, 13న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీఎస్ఏఎం చైర్మన్ మన్నెరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, 14న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్, సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఏపీ కుర్ప/కురుమ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మన్వి దేవేంద్రప్ప పాల్గొని అర్జీలు స్వీకరిస్తారు.





అనంతపురం జిల్లా అభివృద్ధి, సమస్యలు, ప్రాజెక్టుల పురోగతిపై జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం సమీక్ష నిర్వహించారు.

# వైసీపీ నేతలకు అండగా ఎస్ఐ అరాచకాలు

- చంద్రబాబు అరెస్టు సమయంలో బైండోవర్ చేశారు
- తన కుటుంబాన్ని వేధించి ఇబ్బందులు పెట్టాడు
- వైసీపీ నేతలపై ఇచ్చిన ఫిర్యాదులపై కేసు పెట్టలేదు
- కోనసీమ జిల్లా ఆదురుకు చెందిన బాధితుడి గోడు
- ప్రజావినతుల కార్యక్రమానికి వెల్లువెత్తిన ఫిర్యాదులు
- భూ కబ్జాలు, మోసాలు, వేధింపులపై అధికంగా అర్జీలు
- వినతులు స్వీకరించిన మంత్రి అనం, ఏపీఎఫ్‌డీసీ చైర్మన్



మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజావినతుల కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు సమస్యలు చెప్పుకునేందుకు తరలివచ్చారు.బాధితుల నుంచి దేవాదాయ శాఖ మంత్రి అనం రామనారాయణరెడ్డి, ఏపీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు అర్జీలు స్వీకరించారు. ఎక్కువగా భూ కబ్జాలు, మోసాలపైనే బాధితులు న్యాయంచేయాలని కోరుతూ వినతులు అందజేశారు. సమస్యలు విన్న మంత్రి ఆయా శాఖల అధికారుల మాట్లాడి పరిష్కరిం చాలని ఆదేశించారు.

### ఎస్ఐ అరాచకాలపై విచారణ జరిపించాలి

– గత ఐదేళ్లు వైసీపీ నాయకులు నాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి వేధిం చారని అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం, మామిడికుదురు మండలం ఆదురు గ్రామానికి చెందిన కొల్లు నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశాడు. వైసీపీ నాయకులపై ఇచ్చిన ఫిర్యాదుపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు..చంద్రబాబును అరెస్టు చేసిన సమయంలో తనపై బైండోవర్ బుక్ ఓపెన్ చేసి ఎస్ఐ పలుమార్లు మా కుటుం బాన్ని ఇబ్బంది పెట్టారు. విచారణ జరిపించి అలాంటి పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

### శివాలయం భూమి కబ్జా చేసిన వైసీపీ సర్పంచ్

– అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం సానిపాయి గ్రామస్తులు సమస్యను వివరి స్తూ 2019లో శివాలయం కోసం సర్వే నెంబర్లు 669/1, 699/2లో ప్రభుత్వం భూమి కేటాయించింది. వైసీపీ సర్పంచ్ నేతి అంజనేయులు అధికారులతో కుమ్మక్కై ఆ భూమికి 1978లో పట్టా పొందినట్లు దొంగ పట్టా సృష్టించి భూమిని కబ్జా చేశారు. విచారణ చేసి తిరిగి ఆ భూమిలో దేవాలయం కట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు.

– తన కష్టార్జితంతో కొనుగోలు చేసిన 5 సెంట్ల భూమిని దరువూరి శ్రీనివాసరావు అనే వ్యక్తి కబ్జా చేసి తనపై దాడికి ప్రయత్నిస్తున్నాడని పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం ఇరుకుపాలెం గ్రామానికి చెందిన పాపగంటి దానియల్‌బాబు ఫిర్యాదు చేశాడు. అతనిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

### పనులు చేయకుండానే రూ.70 లక్షలు దోచుకున్నారు

– పంచాయతీలో ఎటువంటి పనులు చేయకుండా తప్పుడు రికార్డులు సృష్టించి ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులను గ్రామ సర్పంచ్..కొంతమంది అధికారులతో కలిసి రూ.70 లక్షల ప్రజాధనాన్ని దారి మళ్లించారు. వారి అవినీతిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం సానిపాయి గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

– కరెంట్‌బిల్లు ఎక్కువ వచ్చిందని వైసీపీ ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛన్‌ను అక్రమంగా ఆపివేశారు. వృద్ధాప్య పింఛన్‌ను తిరిగి పునరుద్ధరించాలని బాపట్ల జిల్లా రేపల్లె పట్టణానికి చెందిన రామచంద్రరావు కోరారు.

### శ్మశాన వాటికను ఆక్రమించి దందా

– ఏలూరు జిల్లా భీమడోలు మండలం కురెళ్లగూడెం గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు సమస్యను వివరిస్తూ ఎస్సీ కాలనీ చెందిన శ్మశాన వాటికను పాలకుర్తి చిన్న అనే వ్యక్తి ఆక్రమించారు.. దానివల్ల శ్మశాన వాటిక సరిపోక ఒకరి శవం మీద మరొకరి శవం పాతిపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.. ప్రశ్నించిన వారిపై ఎదురుదాడి చేసి బెదిరిస్తున్నాడు.. సమగ్ర విచారణ జరిపించి ఎస్సీ కాలనీకి శ్మశాన వాటికను కేటాయిం చాలని కోరారు.

– మా గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ గాదె నాగబాబు ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ.3 కోట్లు స్వాహా చేసి అక్రమాలకు పాల్పడ్డాడు..అతనిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.

### పెళ్లి చేసుకుంటానని మోసగించిన కానిస్టేబుల్

– మునీస్ షరీఫ్ అనే ఏఆర్ కానిస్టేబుల్ తనను ప్రేమిస్తున్నానని చెప్పి పెళ్లి చేసు కుంటానని నమ్మించి 2018లో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు.. ఐదేళ్లుగా అలాగే నమ్మిం చి పెళ్లి చేసుకోకుండా ప్రస్తుతం రూ.50 లక్షలు కట్నం ఇస్తేనే పెళ్లి చేసుకుంటానని బెదిరిస్తున్నాడు.. దయచేసి నాకు న్యాయం చేయాలని బాపట్ల జిల్లా చినగంజాం గ్రామానికి చెందిన సయ్యద్ కరిష్మా ఫిర్యాదు చేసింది.

– గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు దాడి చేసి నాపై కేసులు పెట్టి గురజాల సబ్‌జైలులో 20 రోజుల పాటు వేధించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గుజ్జల పాపిరెడ్డి అనే వ్యక్తి వైసీపీ నేతలతో చేతులు కలిపి కులం పేరుతో దుషించారు.. వారి పై తగిన చర్యలు తీసుకోవాలని పల్నాడుజిల్లా మండాది గ్రామానికి చెందిన దాసరి అజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు.





# 'పాఠశాల పండుగ'ను విజయవంతం చేయాలి

- మంచి వాతావరణం, విద్యావికాసానికి నాంది
- రాజకీయాలకు అతీతంగా పాల్గొని సూచనలివ్వాలి
- గత ప్రభుత్వంలో విద్యాప్రమాణాలు దిగజారాయి
- లోకేష్ చర్యలతో విద్యాశాఖకు పూర్వవైభవం
- మాజీ మంత్రి పీతల సుజాత

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 7న జరిగే 'పాఠశాల పండుగ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి పీతల సుజాత పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నారా లోకేష్ 'పాఠశాల పండుగ' కార్యక్రమానికి స్వీకారం చుట్టనున్నారని, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, దాతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సత్సంబంధాలు ఏర్పడటమే కాకుండా విద్యార్థులలో నెలకొన్న భయాలు తొలగిపోతాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు చదువుపై ఆసక్తి మరింత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం విద్యా వికాసానికి, ఒక మంచి వాతావరణానికి ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమం జరగాలని కోరుకుంటున్నామని చెప్పారు. లోకేష్ విద్యాశాఖ మంత్రి కాగానే విద్యాశాఖ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం త్వరలో మెగా డీఎస్సీ నిర్వహించబోతోంది.. 16,347 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల స్కూళ్లలో విద్య కుంటుపడేలా జగన్ జీవో ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే సమస్యను పరిష్కరించి త్వరలో గిరిజన ఉపాధ్యాయులను కూడా నియమించబోతున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తోందని వివరించారు. ఉపాధ్యాయులపై ఉన్న భారాలను తగ్గించి విద్యార్థులకు చదువు చెప్ప డమే వారి పనిగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గతంలో జగన్ ప్రభుత్వ హయాంలో ఎయిడెడ్ పాఠశాలలపై కత్తికట్టారు.. విద్యాశాఖను అట్టడుగు స్థానానికి దిగజార్చారు. కూటమి ప్రభుత్వం రాగానే అటువంటి వేధింపులు తగ్గాయి.. ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెరిగాయని తెలిపారు.

### జగన్ విద్యాప్రమాణాలు దిగజార్చారు

జగన్ హయాంలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా ఎక్కడబడితే అక్కడ దొరికేది.. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేకుండా చేశారు. జగన్ హయాంలో కాలేజీ, స్కూళ్లలో కూడా గంజాయి, డ్రగ్స్ దొరికేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి, డ్రగ్స్ బారినపడకుండా కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. 2014-19లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా విద్యాప్రమాణాల్లో ఏపీ బెస్ట్‌గా నిలిచింది..విద్యాశాఖను దేశంలో ఏపీని 3వ స్థానంలో నిలిపారు. జగన్ హయాంలో అదికాస్త 19వ స్థానానికి దిగజార్చారని మండిపడ్డారు. లోకేష్ తీసుకున్న చర్యల వల్ల మళ్లీ విద్యాశాఖకు పూర్వవైభవం రానుందని తెలిపారు. ఎడ్యుకేట్, ఎంపవర్, ఎంగేజ్ లక్ష్యాలతో దేశంలోనే తొలిసారిగా రాష్ట్రమంతా ఒకేసారి డిసెంబర్ 7న ఈ 'పాఠశాల పండుగ' అనే కార్య క్రమాన్ని నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఒక మంచి వాతావరణంలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేసేలా రాజకీయాలకు అతీతంగా అందరికీ ఆహ్వానం పలుకుతు న్నామని తెలిపారు. అందరూ హాజరై విద్యార్థుల భవిష్యత్తు కోసం మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.



# సామాజిక పింఛన్లు అమలులోకి తెచ్చిందే టీడీపీ

- అరకులో సామాజిక పించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కిడారి శ్రావణ్ కుమార్



అరకు (చైతన్యరథం): హుకుంపేట మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షులు కొర్ర తులసిరావు ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షులు, రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ముఖ్యతిథిగా పాల్గొని పింఛనుదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు నెల మొదటి రోజే పింఛను అందుతుందని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని నెలలో ఒకటవ తారీకున సెలవు కావున 30వ తారీకు పింఛను పంపిణీ చేసిన ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానిదేనని పింఛను దారుల బాధలను గుర్తించిన కూటమి ప్రభుత్వం పింఛను పెంచిన ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానిదని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొర్ర తులసిరావు, ప్రధాన కార్యదర్శి సిర్గం సూర్యకాంతం, బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ్ స్వామి, అండీభ సర్పంచ్ తామర్ల సత్యనారాయణ, శోభకోట సర్పంచ్ పలసీ శశి భూషణంనాయుడు, ఎంపీటీసీ కొమ్మెరమ, మాజీ సర్పంచ్ పెల్లమల రామలింగం, కామేష్, టీడీపీ నాయకులు కర్ర అచ్చిబాబు మురళి తదితరులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం

- పి.అమిటి గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టిన టీడీపీ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



పార్వతీపురం మన్యం జిల్లా, కురుపాం నియోజకవర్గం, గుమ్మలక్ష్మీపురం మండలం, పి.ఆమిటి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వవిప్, కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇచ్చిన మాట ప్రకారం ప్రతినెల ఒకటవ తేదీనే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ ఇస్తున్నామని, ఆదివారం సెలవు కావడంతో ఒకరోజు ముందుగానే ఇస్తున్నామన్నారు. సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాడి.సుదర్శనరావు, ఎంపీడీవో సాల్మన్ రాజ్, ట్రైకార్ బోర్డ్ స్టేట్ డైరెక్టర్ పువ్వల లావణ్య, నాయకులు తాడంగి కేశవరావు, రామారావు, కిల్లక.శాంత కుమార్, తాడంగి దమయంతి, పాలక భాస్కరరావు, నిమ్మక జనార్దన్, అరిక మంగులు సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మన్యంలో పెరిగిన చలి తీవ్రత.... భారీగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు



మన్యం (చైతన్యరథం): చలి తీవ్రత కొనసాగుతోంది. గూడెంకొత్తవీధి, జి.మాడుగులలో గురువారం ఉదయం 8.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. చింతపల్లిలో 9.4, అనంతగిరి 15, అరకులోయ 9.1, హుకుంపేట 8.8, కొయ్యూరు 13.3, ముంచంగిపుట్టు 11.2, పాడేరు 9.6, పెదబయలులో 9.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయన్నారు. పెదబయలులో ఈ ఏడాది చలి తీవ్రత అధికంగా ఉంది. దట్టమైన పొగ మంచు కురుస్తుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఉదయం పది గంటల వరకు చలితీవ్రత తగ్గడం లేదు. మధ్యాహ్నం మూడు గంటల నుంచే మళ్లీ ప్రారంభమవుతోంది. చలిమంటలతో పలువురు ఉపశమనం పొందుతున్నారు. గతంలో చింతపల్లి, పాడేరు, అరకులోయ ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. అందుకు భిన్నంగా శివారు మండలాల్లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఈ ప్రాంతీయులు చలికి ఇబ్బందులకు గురవుతున్నారు.

# ఉత్తరాంధ్రలోని రహదారులపై దృష్టిసారించండి : రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం (చైతన్యరథం): ఉత్తరాంధ్రలోని రహదారులను అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు కోరారు. ఢిల్లీలో శుక్రవారం ఆయనను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. రహదారుల పరిస్థితిని వివరించారు. కళింగపట్నం-శ్రీకాకుళం-పార్వతీపురం (సీఎస్పీ) రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని, దీని ద్వారా ఒడిశాలోని రాయగడ, చత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్ రోడ్లతో అనుసంధానం జరుగుతుందని వివరించారు. అలికాం-బత్తిలి రహదారి విస్తరణతో ఒడిశాలోని పర్లాఖెముండి వరకు రవాణా సదుపాయం మెరుగవుతుందని చెప్పారు. వాటికి మంత్రి సానుకూలంగా స్పందించారని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

ఆదిత్యాలయానికి ప్రసాద్ పథకం వర్తింపజేయాలి...

అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయానికి ప్రసాద్ పథకాన్ని వర్తింపజేయాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ను కె.రామ్మోహన్నాయుడు కోరారు. ఢిల్లీలో శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఆదిత్యాలయ అభివృద్ధికి సంబంధించి రూపొందించిన డీపీఆర్ న్ను ఆయనకు అందజేశారు.

# పైడితల్లి అమ్మవారి దర్శించుకున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి



విజయనగరం (చైతన్యరథం): సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్. వి.రమణ శనివారం విజయనగరం శ్రీ పైడితల్లి అమ్మవారి దేవాలయాన్ని సందర్శించారు. దేవాలయం వద్ద మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎం.పి కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా జడ్జి బి.సాయి కల్యాణ చక్రవర్తి, కలెక్టర్ డా.బి.ఆర్.అంబెద్కర్, ఎస్.పి వకుల్ జిందాల్, గురజాడ సాంస్కృతిక సమైక్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ లు స్వాగతం పలికారు. ఆలయ అధికారులు, ప్రధాన పూజారి బంటుపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జస్టిస్ ఎన్.వి రమణ సతీసమేతంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. మంత్రి కొండపల్లి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎన్.వి రమణకు అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించి సత్కరించారు.

# పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి



విజయగరం (చైతన్యరథం): శనివారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుడిటి ఈశ్వరరావుతో కలిసి ఎచ్చెర్ల నియోజకవర్గం పతివాడతపాలెం, పైడి భీమవరం ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి కుటుంబం ఆనందంగా సంతోషంగా ఉండాలనిదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. లక్షలాదిమంది వృద్ధులు దివ్యాంగులు వితంతువులు, చేనేత కార్మికులు, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి సామాజిక పింఛన్లు ఇస్తున్న ఘనత రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వంకు లభిస్తుందని ఆయన వివరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రైతు శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్నాం

- ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లో నగదు
- వెల్లడించిన టీడీపీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి



శృంగవరపుకోట (చైతన్యరథం) : రైతు శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్నామని టీడీపీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి వ్యాఖ్యానించారు. శనివారం శృంగవరపుకోట నియోజకవర్గం వేపాడ మండలం వేపాడ గ్రామంలో రైతుసేవా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నెలలు తరబడి డబ్బులు ఇచ్చే వారు కాదని, ఇప్పుడు చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన 48 గంటల్లో డబ్బులు ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు రైతులు ఖాతాల్లో 500 కోట్లకు డబ్బు జమ చేయడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలుల్లో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. వాతావరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా అధికారులు త్వరగా ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇబ్బందులు కలవకుండా చూడాలని నిర్వాహకులకు తెలిపారు. అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకునే ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. రైతులతో సమన్వయంతో ముందుకు సాగి వారి సమస్యలు పరిష్కరించి, రైతుల ఆర్థిక అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన బోర్డు డైరెక్టర్ మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి,మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, ఎంపీటీసీ గొంప తులసి, గోగాడ జగన్నాథంనాయుడు, నల్లబిల్లి మహేష్, శానాపతి అప్పారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రైతున్నపాలిట వాయు గండం



పి.గన్నవరం (చైతన్యరథం): వాయుగుండం ప్రభావంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో పూర్తిగా మార్పుచోటుచేసుకుంది. మధ్యాహ్నం నుంచి కోనసీమలో పలుచోట్ల వర్షం కురవడంతో రైతుల్లో కలవరం మొదలైంది. రెండురోజులనుంచి హెచ్చరికలు వస్తున్నా వర్షం లేక పోవటంతో రైతులు పెద్దగా కంగారుపడలేదు. ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 1,68,780 ఎకరాలు. దీంట్లో సాగుచేసిన విస్తీర్ణం 1,57,811 ఎకరాలు, 98వేల ఎకరాల విస్తీర్ణంలో వరికోతలు పూర్తయినట్లు జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. ప్రస్తుతం కళ్లాల్లో 39వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రాశులరూపంలో ఉందని ఆయన తెలిపారు. ఇంకా 59,811 ఎకరాల విస్తీర్ణంలో కోతలు కోయాల్సి ఉంది. దీంట్లో సుమారు 40వేల ఎకరాల విస్తీర్ణంలో వరిచేలు పక్వానికి వచ్చి కోతకు సిద్ధంగా ఉన్నాయి. వాయుగుండం కారణంగా వరికోతలు వాయిదా వేసుకోవాలని అధికార యంత్రాంగం రైతులను అప్రమత్తం చేసింది.

# వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం



గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం వల్లే పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలకు కారణమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ అన్నారు. పరవాడలోని లాగూర్ లేబొరేటరీస్ ఫార్మా కంపెనీలో ప్రమాదానికి గురై షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్బాబుతో కలిసి ఆయన శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరగడం బాధాకరమన్నారు. పరిశ్రమల్లో భద్రతకు రిటైర్డ్ ఐఏఎస్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక కమిటీ వేశారని, వారి నివేదిక ఆధారంగా పటిష్ట చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సుమారు 250 పరిశ్రమలు ఉంటే వైకాపా ప్రభుత్వం భద్రతా పరమైన దర్యాప్తునకు మూడు సంస్థలకే ఉత్తర్వులు ఇవ్వడంతో వారు ఇబ్బడిముబ్బడిగా దోచుకొని భద్రతా లోపాలు చూడకుండా అనుమతులు ఇచ్చేశారన్నారు.

ఈఎస్ఐ నిధులను సైతం కార్మికులకు ఉపయోగించకుండా మళ్లీ వెనక్కిపోయేలా చేసుకున్న అసమర్థ పాలన వైసీపీదేనన్నారు.. ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు రూ.40 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించామన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్బాబు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను పరామర్శించి బాధితుల పక్షాన నిలబడ్డారని గత మూడు రోజులుగా ఆసుపత్రుల్లో తిరుగుతూ వారికి భరోసా ఇస్తున్నారన్నారు.

తుపాను హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా శుక్రవారం పట్టిసీమ ఎత్తిపోతల పథకం పంపుల నుంచి పోలవరం కుడి కాలువలోకి నీటి విడుదల నిలిపివేసినట్లు పర్యవేక్షణ డీఈ పెద్దిరాజు చెప్పారు. ఇప్పటి వరకు 20.38 టీఎంసీలు దిగువకు వెళ్లినట్లు వెల్లడించారు.



గోపాలపురం నియోజకవర్గం ద్వారక తిరుమల మండలం, జి.కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు. సంక్షేమానికి మారుపేరుగా టీడీపీ ప్రభుత్వం నిలుస్తుందని ఆనాడు ఎన్టీఆర్ రూ.20 సామాజిక పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారని, నేడు చంద్రబాబు రూ.4 వేలకు పెంచడం జరిగిందన్నారు. వృద్ధులు, పేదల పాలిట ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల పంపిణీ ఒక వరంగా మారిందని మద్దిపాటి వెంకటరాజు తెలిపారు.



# ఉప్పాడ తీరంపై తీవ్ర ప్రభావం చూపిన ఫెయింజల్

- ఎగిసిపడుతున్న రాకాసి అలలు... కోత బారిన తీరప్రాంత గ్రామాలు
- తీరప్రాంతాల గ్రామాల్లో పర్యటించిన టీడీపీ నేత వర్మ



పిఠాపురం (చైతన్యరథం): ఫెయింజల్ తుపాన్ ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. సముద్ర తీరపు ప్రాంత మత్స్యకారులు, గ్రామస్థులు నిత్యం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎక్కడ తమ ఇళ్లు, భూములు సముద్రంలో కలిసి పోతాయోనని బెంబేలెత్తిపోతున్నారు. ఫెయింజల్ తుపాన్ ప్రభావం కాకినాడ జిల్లా యు కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంపై తీవ్రంగా చూపింది. గత రెండు రోజులుగా సముద్రంలోని పెను మార్పులు ఏర్పడి రాకాసి అలలు తీవ్ర ప్రభావం చూపాయి. కెరటాల తాకిడికి తీర ప్రాంత గ్రామాలు కోత బారినపడ్డాయి. విద్యుత్ స్తంభాలు, గృహాలు, చెట్లు నేలకొరిగి సముద్రంలో కలిసిపోయాయి. బాధితులు నిలవడానికి నీడ లేక రోడ్డున పడ్డారు. ప్రధానంగా ఉప్పాడ, మాయాపట్నం సూరాడపేట, కోనపాపపేట గ్రామాలు కోత బారిన పడ్డాయి. నెల రోజుల వ్యవధిలో రెండు తుపాన్ల ప్రభావం తీర ప్రాంత గ్రామాలపై పడటంతో మత్స్యకార కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నాయి.

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే వర్మ తీర ప్రాంత గ్రామాల్లో, కోతకు గురైన మత్స్యకార గ్రామాల్లో పర్యటించారు. కోత ప్రభావాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. గృహాలు కోల్పోయిన వారికి సురక్షిత ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం నివారణకు చర్యలు చేపట్టిందని తెలిపారు. త్వరలోనే రక్షణ గోడ నిర్మాణం ప్రారంభిస్తామని అన్నారు. గృహాలు కోల్పోయిన వారికి సురక్షిత ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని, అలాగే త్వరలోనే రక్షణ గోడ నిర్మాణం ప్రారంభిస్తామని టీడీపీ నేత వర్మ హామీ ఇచ్చారు.

# కాకినాడలో సాజావుగా సాగిన పింఛన్ల పంపిణీ



కాకినాడ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ప్రతీ నెలా ఒకటో తేదీనే ఎన్టీఆర్ భరోసా పింఛను సొమ్ము అందిస్తోంది. ఒకటో తేదీ ఆదివారం, పండుగలు వస్తే దానికి ముందురోజే పింఛను పంపిణీ చేస్తోంది. డిసెంబరుకు సంబంధించి ఒకటో తేదీ ఆదివారం రావడంతో నవంబరు 30న (శనివారం) పింఛను పంపిణీ చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లాలోని 21 మండలాల పరిధిలో 2,73,881 మందికి రూ.115.69కోట్లు విడుదల చేసింది. ఈ సొమ్మును శుక్రవారం నాడే బ్యాంకుల నుంచి ఉపసంహరించి, గ్రామ/వార్డు కార్యదర్శులకు అందజేశారు. శనివారం ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్ము అందించేలా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందితో పాటు కొందరు ప్రభుత్వ ఉద్యోగులను పింఛను పంపిణీకి నియమించింది. సక్రమంగా సాగేలా మండల, పట్టణ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించింది. శనివారం ఒక్కరోజూ మొత్తం పింఛన్లు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ షాన్మోహన్ తెలిపారు. ఎక్కడా పొరపాటు జరగకుండా రోజంతా పర్యవేక్షించారు.

# రైతులకు అండగా ఉంటాం : వీరంకి గురుమూర్తి

- లంకలకు వెళ్లే రోడ్డు పునరుద్దరణ పనులు ప్రారంభం
- ఎమ్మెల్యే కుమార్ రాజా, గురుమూర్తి చొరవ వల్లే సాధ్యపడిందని రైతుల వెల్లడి

రైతుల కష్టం తెలిసినవాడిగా,వారికి అండగా ఉండే విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి స్పష్టం చేశారు. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం తోట్ల వల్లూరు గ్రామం నుండి లంక గ్రామాలకు వెళ్లే దారి అస్తవ్యస్తంగా ఉండటంతో, ఈ సమస్యను గుర్తించిన పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార రాజా ఆదేశాల మేరకు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి పరిష్కార సాధన దిశగా కార్యాచరణను చేపట్టారు. యుద్ధ ప్రాతిపదికన జేసిబి యజమాని మైనేని చంటి సహకారంతో కేసీపీ వారి మద్దతుతో పనులను వరదల కంటే ముందు నాలుగు రోజులపాటు రైతులు పనులు చేయించారు. అయితే, ఇటీవల వచ్చిన కృష్ణానది వరదలకు నదిలో రోడ్డు దెబ్బ తినడంతో, మళ్ళీ రోడ్డును పునరుద్ధరించే పనులకు గురుమూర్తి శ్రీకారం చుట్టారు. శనివారం దగ్గర ఉండి పనులను ప్రారంభింపజేశారు. లంక దారి పనులను సత్వరం పూర్తి చేయించేలా చర్యలను ముమ్మరం చేశారు. ప్రభుత్వం నుండి నిధుల మంజూరు కోసం వేచి చూడకుండా, ముందుగానే స్పందించి, రైతుల పట్ల ప్రేమతో, సామాజిక స్పృహతో చొరవ తీసుకొని పనులు జరిపిస్తున్న గురుమూర్తికి మరియు శాసన సభ్యులు వర్ల కుమార రాజాకు, మరియు మైనేని చంటి తదితరులకు రైతులు ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు రైతు అధ్యక్షులు లెక్కల గుడి మురళి తోట్లవల్లూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గోరిపర్తి గోపయ్య, తోటవల్లూరు తెలుగుదేశం గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి వల్లూరు రాంబాబు, తోట్లవల్లూరు మాజీ ఉప సర్పంచ్ చిరుమామిళ్ళ మోహన్ మంజు , తోట్లవల్లూరు పంచాయతీ వార్డు సభ్యులు తోట రామకృష్ణ ఆసిఫ్ భాషా, కృష్ణ జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు దౌల, టిడిపి నాయకులు తోట సాయిబాబు నెక్కలపూడి రాంబాబు గొరిపర్తి శ్రీనివాసరావు డొక్కు శివశంకర్ డొక్కు నాగయ్య ఈడుపుగంటి చిన్నారి జంపాన కొండ వీరంకి కృష్ణ వల్లూరు కుమార్ అబ్దుల్ సలాం ఉయ్యూరు సురేష్ తదితర తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొనడం జరిగింది.



# డిసెంబర్ 2 నుంచి కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులకు దరఖాస్తుల ప్రక్రియ : జీవీ

◆ వినుకొండలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లిఖార్జునరావు



వినుకొండ (చైతన్యరథం): డిసెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాబోతున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లు, రేషన్‌కార్డులు అందిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వస్తాయో రావో అన్నట్లుగా పింఛన్ల పరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒకటో తేదీన ఠంచనుగా ఇంటికే పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఒకటో తేదీ సెలవు అయితే 30వ తేదీనే పింఛన్లు అందిస్తున్నామని, ఇలా నెలకు రూ.4 వేలు ఒకటో తేదీనే ఇంటికే పింఛన్లు ఇస్తున్న ప్రభుత్వం దేశంలో ఆంధ్రప్రదేశ్ మాత్రమే అని పేర్కొన్నారు. వినుకొండ రెండో వార్డు పరిధిలోని సీతయ్యనగర్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. లబ్ధిదారులకు స్వయంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల సొమ్మును అందజేశారు. అలాగే వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి విచ్చేసి నగదు పంపిణీ చేయడంపై లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ 65.20 లక్షలమందికి పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీ మాత్రమే అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ వల్లనే ఇది సాధ్యమవుతుందన్నారు. ఐదేళ్లు జగన్‌రెడ్డి ప్రజలను మోసం చేశారని, పింఛన్‌పై రూ.వెయ్యి పెంచడానికి ఐదేళ్లు పట్టిందన్నారు. పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలోనే వినుకొండ ముందుందని, చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఒకేరోజు 99 శాతం మందికిపైగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశామన్నారు. ఇకపై ఏ నెలలోనైనా పింఛను తీసుకోకపోతే ఆ మరుసటి నెల మొత్తం కలిపి ఇస్తున్నామన్నారు. 2 నెలలు తీసుకోకపోతే ఆ తర్వాత నెలలో 3 నెలల డబ్బులను ఒకేసారి ఇవ్వనున్నామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని విచ్చలవిడిగా దోచుకున్నారని, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికను కూడా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలను, పేదలను నిర్లక్ష్యం చేసినందుకే వైసీపీని ఇంటికి సాగనంపారన్నారు. వినుకొండ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు నిధులు ఇచ్చినందుకు సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ పాలనలో కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని, అన్ని కార్పొరేషన్ల గౌరవం పెంచేందుకు నిధులు ఇస్తున్న సీఎం చంద్రబాబు, ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజలు అభినందనలు తెలుపుతున్నారన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చడం తప్ప సాధించింది ఏమీ లేదన్నారు. వ్యవస్థలను కూడా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. నిర్వీర్యమైన వ్యవస్థలను సీఎం చంద్రబాబు చక్కదిద్దుతున్నారని పేర్కొన్నారు. అప్పులకుప్పగా, ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని చక్కదిద్దుతూ గాడిలో పెడుతున్నారన్నారు. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చటానికి సీఎం చంద్రబాబు రూ.వెయ్యి కోట్ల నిధులు ఇచ్చారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రాన్ని పునఃనిర్మిస్తున్నామని, అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ సీఎం చంద్రబాబుకు కుడిభుజంగా ఉండి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడం ఎంతో అభినందనీయమన్నారు. అతి త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించబోతున్నామని, నూతన సంవత్సరంలో అర్హులైన వారికి కొత్త పింఛన్లు కూడా ఇవ్వబోతున్నామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ ఎన్నికల్లో చేసిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కూటమి ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. ఒకానొక సందర్భంలో వాలంటీర్లు లేకపోతే పింఛన్లు ఎలా ఇస్తారని అనుకున్న సమయంలో ప్రభుత్వ అధికారులే దగ్గరుండి ఇంటింటికీ పింఛన్లు అందిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 5 నెలల్లోనే వినుకొండకు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు నేతృత్వంలో బ్రహ్మాండంగా నిధులు వరద వస్తోందని, దీనికి తానే ప్రత్యక్ష సాక్షిని అని తెలిపారు. రామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.2 కోట్లు, తితిదే కల్యాణ మండపానికి రూ.3 కోట్లు, షాదీఖానాకు రూ.3.5 కోట్లు, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నుంచి రూ.2 కోట్లు తీసుకొచ్చారన్నారు. నిధులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ జీవీ ఆంజనేయులు తనకున్న పరిచయాల ద్వారా ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా తీసుకొస్తున్నారని కొనియాడారు.

# అడిటర్లే ఇండియాకు వెల్త్

◆ అకౌంటెంట్స్ అంటే నెంబర్ బిల్డ్ చేసేవారు కాదు... నేషన్ బిల్డ్ చేసే వారు

◆ వెల్లడించిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జీఎస్టి అండ్ ఇన్‌కమ్ టాక్స్ అంశంపై గుంటూరులో ఏర్పాటు చేసిన వర్క్ సెమినార్ కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "అకౌంటెంట్స్ అంటే నెంబర్ బిల్డ్ చేసేవారు కాళ్లు కాదు, నేషన్ బిల్డ్ చేసే వాళ్ళు అని నిరూపించిన మీ అందరికీ ధన్యవాదాలు. ఒక మనిషికి హెల్త్ ఎంత అవసరమో మీలాంటి అకౌంటెంట్లు ఆడిటర్లు ఇండియా వెల్త్‌కు అంత అవసరం. ఎందుకంటే ఎంత సంపాదించినా ఎవరైనా తినేది పిడికెడు మెతుకులే అని నమ్మేటువంటి ఆడిటర్లు మన దేశానికి వన్నె, నమ్మకాన్ని కలిగించేలా పనిచేస్తారు. నిజాయితీపరులకు తప్పుచేస్తే నిద్ర కూడా పట్టదు. కానీ కొందరు ఆడిటర్ల ముసుగులో ఉన్న నాయకులు అన్యాయాలు చేస్తూ బతుకుతారు. అది కూడా ఒక బతుకేనా? అనే నేను అడుగుతున్నాను. ఇండియా అనేది నేడు ఒక లీడర్‌గా ప్రపంచంలో ముందుకు వెళుతుంది. ఇంటర్నేషనల్ టెలికాం యూనియన్ 170 దేశాల నుంచి 4-5 వేల మంది మొట్టమొదటిసారిగా ఇండియాలోని ఢిల్లీలో ఇటీవలే సమావేశం అయ్యారు. ఇండియాలోని స్టార్ట్ అప్ ఎకో సిస్టం, ఒక పాజిటివ్ వైబ్రేట్ కానీ చూసి ఆశ్చర్యపోయారు. నోకియా, ఎరిక్సన్ లాంటి కంపెనీలు అయితే ఇండియాలో ప్రగతిని చూసి నోరెళ్ల పట్టేనంత పని చేశారు. అది ఇండియా టాలెంట్ అంటే. ఆడిటర్లు ఒక సంస్థను ధ్రువీకరిస్తూ, చేసే సంతకం వేల మంది షేర్ హోల్డర్లు, లక్షల జీవితాలు ఉద్యోగులు సామాన్యుల జీవితాలపై ఆధారపడి ఉంటుంది. అందుకనే సంస్థలు ఆడిటర్లను అంత గౌరవంగా గుర్తిస్తాయి. నేను 2001లో అమెరికాకు వెళ్లే సమయానికి నా కుటుంబానికి ఉన్న ఆస్తి రూ.30 లక్షల అప్పులు. అప్పట్లోనే నేను 100 - 200 డాలర్లు సేవ్ చేసి కంపెనీని ప్రారంభించాను. ఆ తర్వాత డాక్టర్‌గా పనిచేస్తూ టీచింగ్ వైపు వెళ్లాలంటే తక్కువ వేతనం అందేది. అన్ని అప్పులు ఉండి కూడా డబ్బులు తక్కువ వస్తాయని తెలిసినా పదిమందికి ఉపయోగపడేలా టీచింగ్ ప్రొఫెషన్‌ను ఎందుకున్నాను. ఆడిటర్లు ఏవైతే సమస్యలు ఉన్నాయని విన్నవిస్తున్నారో, వాటిని నాకు తెలియజేస్తే చంద్రబాబు గారి దృష్టికి తీసుకువెళ్లి నెరవేర్చే దిశగా ప్రయత్నిస్తాను. ఈ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు అందరికీ నా ధన్యవాదాలు" అని పెమ్మసాని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీ డీపీసీఏ చైర్మన్లు వై శ్రీనివాస శేష సాయిబాబు, బిఎస్ సీతాపతి రావు గారితో పాటు ప్రెసిడెంట్ దామచర్ల శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ టి. చంద్రమౌళి, బి. శ్రీనివాసరావు, అడ్వైజర్స్ షరీఫ్ ఖాన్, బిపిఆర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణి చేసిన ఎమ్మెల్యే గళ్ళా



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గంలో 33వ డివిజన్ దేవాపురం 5వ లైన్, 34వ డివిజన్ ఫాతిమాపురం నందు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఎమ్మెల్యే గళ్ళా మాధవి వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులకు పెన్షన్లను ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాజిక పింఛన్లు ప్రతి నెలా 1వ తేదీనే ఇంటికి వెళ్లి పంపిణీ చేస్తున్నామని, 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో ఒకరోజు ముందే పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని, ఇది ప్రజల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఆపన్నులకు సహాయం అందించటంలో తమ ప్రభుత్వము ఎప్పుడు ముందు ఉంటుందని, వివిధ రూపాల్లో ప్రజలను ఆదుకుంటున్నామని, ఒక రోజు ముందు గానే పెన్షన్లు అందటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో గొనుగుంట్ల కోటేశ్వరరావు, ఈరాంటి వర ప్రసాద్, పోపూరి నరేంద్ర, దగ్గు కిరణ్,చిన్న బాజీ, పఠాన్ అన్వ ఉప్పుటూరి పేరయ్య, కొణికి వినోద్, మన్నయ్య, అన్వర్,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో అసాధ్యాన్ని సుసాధ్య చేయవచ్చు

ఆత్మవిశ్వాసంతో అసాధ్యాన్ని సుసాధ్య చేయవచ్చని దివ్యాంగులు నిరుపిస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. శనివారం గుంటూరు నగరంపాలెంలోని ఎన్జీవో కళ్యాణమండపం నందు దివ్యాంగ ఉద్యోగులు ముందస్తు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిదిగా హాజరయ్యి ప్రసంగించి, దివ్యాంగ ఉద్యోగులను సత్కరించారు. ఎంతో మంది మేధావులు వైకల్యాన్ని అధిగమించి చాలా రంగాలలో ప్రతిభ చాటారన్నారు. ప్రభుత్వం కూడా దివ్యాంగులకు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు కూడా దివ్యాంగ పిల్లలకు సరైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

# వృద్ధులు, వికలాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు

◆ గన్నవరం నియోజకవర్గంలో పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం (చైతన్యరథం): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా వృద్ధులు, వికలాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయని గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. డిసెంబర్ 1వ తేదీ ఆదివారం కావటంతో ఒక రోజు ముందుగానే ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శనివారం విజయవాడ రూరల్ మండలంలోని నిడమానూరు ఎనికెపాడు గ్రామాల్లో ప్రతి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లు పంపిణీకి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. పెన్షన్లు పంపిణీలో ప్రభుత్వం ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేస్తూ ప్రజల వద్దకే పాలన తీసుకుని వెళ్తుందని అన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రజలు ఎన్డీయే కూటమికి భారీ మెజార్టీని కట్టబెట్టారని అన్నారు. గత పాలకుల పరిపాలన శాపం కారణంగా బుడమేరుకు వరద ముప్పు వచ్చిందన్నారు. 12 రోజులు పాటు ఇల్లు వదిలేసి కలెక్టరేట్‌నే తన కార్యాలయంగా మార్చుకుని చంద్రబాబునాయుడు పని చేశారని గుర్తుచేశారు. వైసీపీ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీ రాకుండా మైక్ ఇవ్వట్లేదు అనే చెప్పటం అమానుషమన్నారు. శాసన సభకు వస్తే మైక్ ఇస్తారో లేదో తెలుస్తుందన్నారు. ప్రజా సమస్యలపై శాసనాలు చేసే శాసనసభలో నాయకులు ప్రశ్నించాలని సూచించారు. ప్రజల తరుపున వైసీపీ శాసన సభ్యుల్ని, జగన్మోహన్‌రెడ్డినీ అసెంబ్లీకి రావాలని కోరుతున్నా అని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కోనేరు శివరామ కృష్ణారావు బాగండిపాటి కృష్ణ, పొదిలి శ్రీను, వెంకట నారాయణ, పొదిలి లలిత, కోనేరు సందీప్, బత్తిన చలపతి, పొదిలి దుర్గారావు, టంకశాల శివ, బండి వెంకట్రావు, గరికిపాటి రామ్మోహన్‌రావు, ఆరవపల్లి రమేష్, జాలాది సత్యనారాయణ, అడుసుమిల్లి నవీన్, మాదల నాని బాబు, మీసాల రామ్మూర్తి, మహమ్మద్ షఫీ, దావీదు, వందనం, నరేష్, బాబీ అధికారులు పాల్గొన్నారు.

# పేదల కడుపులు నింపేందుకే అన్న క్యాంటీన్లు

- ఐదు రూపాయలకే రుచికరమైన అల్పాహారం, భోజనం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయచోటి, (చైతన్యరథం):: పేదల కడుపు నింపడానికే ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు జరిగిందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ యాంలో నూతనంగా నిర్మించిన అన్న క్యాంటీన్‌ను మంత్రి మండిపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం గత ప్రభుత్వంలో తొలగించిన అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభం జరిగిందన్నారు.గతంలో అన్న క్యాంటీన్లకు ఎంతో ప్రాముఖ్యత ఉండేదని మళ్లీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదలు, కూలీల కడుపు నింపడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రతి క్యాంటీన్ వద్ద పూటకి 400 మందికి, రోజుకి 1200 మందికి టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి పూట భోజనం ఉంటుందన్నారు. అన్న క్యాంటీన్‌ల వల్ల పేదలంతా మూడు పూటలా భోజనం చేసి సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు. ఇకనుంచి రాష్ట్రంలో ఎక్కడ కూడా ఆకలి కేకలనేటివి ఉండవన్నారు. రాయచోటి పట్టణంలో ప్రస్తుతం రెండు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఉద్యోగస్తులకు జీతాలు వృద్దులకు పెన్షన్లు పంపిణీ చేయాలంటే ఎంతో కష్టంగా ఉండేదని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎక్కడా లేని విధంగా ప్రతినెల 1వ తేదీ రాకముందే పెన్షన్ల పంపిణీ, ఉద్యోగులకు నెలనెలా ఒకటవ తేదీన జీతాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

# వారి కళ్లలో అంతులేని ఆనందం చూశా!

- తుపానులోనూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ
- ఒకరోజు ముందుగా అందడంతో వెల్లివిరిసిన సంతోషం
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి (చైతన్యరథం): ఎన్టీఆర్ భరోసా పథకంలో పింఛన్ సొమ్ము ఒకరోజు ముందుగా అందుకున్న లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందభాష్పాలు చూడడం తనకు అనందదాయకంగా ఉన్నట్లు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాజీవ్ నగర్‌లో ఆయన పలువురు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఫెంగాల్ తుపాను కారణంగా వర్షాలు ఉధృతంగా కురుస్తున్నప్పటికీ లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేయడంతో లబ్ధిదారుల కళ్లలో వెల్లి విరిసిన ఆనందం చూసి తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక భద్రత పింఛను పథకాన్ని ప్రవేశపెట్టింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. దివంగత ఎన్టీఆర్ ముఖ్యమంత్రి హయాంలో నెలకు 35 రూపాయలు పింఛను అందించగా చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే 75 రూపాయలకు పెంచారన్నారు. అయితే 2004 ఎన్నికల ప్రచారంలో పింఛను రెండు వందల రూపాయలు చేస్తామని హామీ ఇచ్చిన వైఎస్ఆర్ అధికారంలోకి రాగానే 25 రూపాయలు మాత్రమే పెంచినట్లు ఆయన గుర్తు చేశారు. కానీ 2014లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం తర్వాత పింఛను 1000 రూపాయలకు పెంచారన్నారు. పాదయాత్ర నేపథ్యంలో పెన్షను 3000కు పెంచుతానని వైసీపీ మేనిఫెస్టోలో పేర్కొని అధికారంలోకి రాగానే ఏడాదికి 250 రూపాయల చొప్పున పెంచి మోసం చేశారని ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం కాగానే ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఏకంగా మూడు వేల రూపాయల నుంచి నాలుగు వేల రూపాయలకు పెంచారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఒడుదుడుగులుగా ఉన్నప్పటికీ పేదల సంక్షేమం విషయంలో టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించడంతోపాటు వారి సమస్యలను తెలుసుకోవడం ఆయన అంకిత భావానికి నిదర్శనమన్నారు. తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని దశలవారీగా అమలు జరుగుతుందన్నారు.గత ఐదేళ్లలో రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నెల్లూరును గంజాయి హబ్‌గా మార్చేశారు

- టీడీపీ నేత చేజర్ల అవేదన



నెల్లూరు (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రాష్ట్రం గంజాయికి హబ్‌గా మారిందని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. జిల్లా కోవూరు లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు జరిగాయన్నారు. దానితో యువత, విద్యార్థులు గంజాయికి బానిసలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలకే కాకుండా శ్రీలంక లాంటి ఇతర దేశాలకు కూడా నెల్లూరు నుండి సరఫరా జరిగేదన్నారు. గంజాయి సరఫరాలో కొంత మంది వైసీపీ నాయకులు ప్రమేయం ఉండటం వల్ల పోలీస్ యంత్రాంగం కూడా ఏమీ చేయలేక పోయిందన్నారు. గంజాయికి అలవాటు పడిన వారు నేరాలు చేయడం మొదలు పెట్టారన్నారు. దీని వల్ల నేరాల సంఖ్య కూడా పెరిగిందన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ చేపట్టడంలో నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఎక్కడ పడితే అక్కడ గంజాయి దొరకడం వల్ల ఇంటర్ చదివే విద్యార్థులు కూడా దీనికి బానిసలుగా మారారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని వెల్లడించారు.

గత ఆరునెలల్లో కొంత వరకు గంజాయిని నియంత్రించడంతో పాటు, గంజాయి వల్ల కలిగే దుష్ఫలితాల గురించి యువతలో అవగాహన కల్పించే కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. రాష్ట్రంలో పూర్తి స్థాయిలో గంజాయి, డ్రగ్స్‌ను కట్టడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎలైట్ యాంటీ - నార్కోటిక్స్ గ్రూపు ఫర్ లా ఎన్ ఫోర్స్మెంట్ ఈగల్ పేరిట ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందని వివరించారు. దీని ద్వారా రాష్ట్ర స్థాయిలోనూ అన్ని జిల్లా కేంద్రాల్లో ఈగల్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారన్నారు. అదే విధంగా టోల్ ఫ్రీ నెంబర్ 1972ను కూడా ఏర్పాటు చేశారు. ఈగల్‌లో సమర్థులయిన అధికార్లను నియమించారన్నారు.

అసాంఘిక శక్తులను అరికట్టడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



# రింగ్ రోడ్డుకు మోక్షం

- సీఎంను అడిగి నిధులు తెస్తా
- అర్థాంతరంగా ఆగిన పనులను పరిశీలించిన ఎమ్మెల్సీ శ్రీకాంత్

కుప్పం (చైతన్యరథం): కుప్పం మున్సిపాలిటీ పరిధిలో అర్థాంతరంగా ఆగిన రింగ్‌రోడ్డు పనులను శాసనమండలి విప్, కుప్పం నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డాక్టర్ కంచెర్ల శ్రీకాంత్ శనివారం పరిశీలించారు. అన్ని రంగాలలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ఆగిపోయిన రింగ్‌రోడ్ పనుల విషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లి వెంటనే నిధులు తేవడానికి కృషి చేస్తానని కంచెర్ల శ్రీకాంత్ వెల్లడించారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు నియోజకవర్గ పరిశీలకులు నరేష్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాజకుమార్, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, సత్యేంద్ర శేఖర్, నాయకులు కాణిపాకం వెంకటేష్, జయరామ్ నాయుడులు ఉన్నారు.

# ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేస్తాం
- గ్రామాలలో సైతం మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం
- వైద్య సిబ్బంది మానవతా దృక్పథంతో పని చేయాలి
- ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, (చైతన్యరథం): ప్రభుత్వ లక్ష్యాలు ప్రజలకు చేరువయ్యేందుకు వైద్య సిబ్బంది రోగులకు సకాలంలో సేవలు అందించాలని దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి డాక్టర్లకు గొట్టిపాటి లక్ష్మి పిలుపు నిచ్చారు. దర్శి మండలం చందలూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పరిశీలించారు. వారితో పాటు దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య కూడా ఉన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పనితీరు ఆసుపత్రిలో అందుతున్న సేవలపై అక్కడి రోగులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ మన కూటమి ప్రభుత్వం విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆమె వివరించారు. అందుకు తగిన విధంగా ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పని చేయాలని కోరారు. గ్రామాలలో సైతం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమిష్టి కృషి అవసరం అన్నారు. ఒక డాక్టర్‌గా రోగులు కష్టాలు తనకు తెలుసన్నారు. అందుకే తాను వైద్యశాలల్లో వసతులను, పనితీరును మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగా దర్శి నియోజకవర్గంలో ప్రతి వైద్యశాలను అభివృద్ధి చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టానన్నారు. ఇందులో భాగంగానే చందలూరు ఆరోగ్య కేంద్రానికి వచ్చానన్నారు. అయితే ఇక్కడ ప్రజల నుండి వైద్య సిబ్బందిపై కొంత అసంతృప్తి ఉందన్నారు. సిబ్బంది సకాలంలో ఆసుపత్రికి రావాలని మెరుగైన వైద్యం అందించాలని ఆమె కోరారు. ఒక డాక్టర్‌గా ఆమె కూడా కొంతమంది రోగులను పరీక్షించారు.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నిరంతరం గ్రామీణ వైద్యం, ఆసుపత్రుల అభివృద్ధి కోసం సమీక్షలు నిర్వహించి కృషి చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా నీరు గార్చారన్నారు. ఆసుపత్రులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలను చెల్లించి తిరిగి ఆరోగ్యశ్రీని గాడిలో పెట్టే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. దర్శి నియోజకవర్గంలో కూడా ఎన్టీఆర్ భరోసా ఆరోగ్యం పథకం కింద అనేకమందికి సహాయం అందించామని డాక్టర్ లక్ష్మి వివరించారు. దర్శి నియోజకవర్గంలో ప్రాథమిక వైద్య కేంద్రాలతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యానికి తాను నిరంతరం కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. డాక్టర్ లక్ష్మి చందలూరు ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్లెస్సితో అక్కడ వసతులు, లోటు పాట్లు, సిబ్బంది సకాలంలో వస్తున్నారా లేదా ప్రజలకు సేవలు అందుతున్నాయా లేదా అని వివరాలు తెలుసుకొని అవసరమైన పరికరాలు, మిషనరీలు కల్పించేందుకు ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

